

డెంగీ బూచీ.. రోగులను దోచి!

కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు డెంగీ బూచీతో జ్వరపీడితుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. 8లో▸



'ఆకర్ష' సేవలు అభినందనీయం

ఆకర్ష పేరుతో కాల్వబుగ్గ రెసిడెన్షియల్ స్కూల్ అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. పాఠశాలలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,772
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,618

న్యూస్‌రీల్

శ్రీశైలానికి భారీ వరద

- మళ్లీ రేపు తెరుచుకోనున్న గేట్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్‌కు భారీగా వరద వస్తోంది. ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి సగటున 1,90,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దిగువ ప్రాజెక్ట్‌లకు సగటున 1,31,000 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. జలాశయ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి 191.2118 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటిమట్టం పెరుగుతున్న క్రమంలో మంగళవారం డ్యాం రేడియల్ క్రస్ట్ గేట్లను తెరిచి నీటిని సాగర్‌కు విడుదల చేయనున్నారు. శనివారం నుంచి ఆదివారం వరకు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలంకు 1,49,604 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 1,05,729 క్యూసెక్కుల నీటిని వదిలారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 68,510 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,818 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 32,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 14.741 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.232 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 880.60 అడుగులకు చేరుకుంది.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూ లైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున నుంచి పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండి పోయాయి. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగు నీరు, అల్పాహారం, బిస్కెట్లు దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. భక్తుల శివ నామస్మరణతో శ్రీశైల ఆలయం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

ప్రకృతి వ్యవసాయంలో రాణించాలి




చెన్నూరులో పంటలను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్

శిరివెళ్ల: ప్రకృతి వ్యవసాయంలో రైతులు రాణించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం చెన్నూరులో ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన వివిధ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఔత్సాహిక మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. మహదేవపురం, బోయలకుంట్ల, యర్రగుంట్ల, కాదరబాదరలో ఆకు కూరలు, కూరగాయల సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఆయన వెంట ఎంటీ రామాంజనేయ రెడ్డి, ఎన్‌ఎఫ్ఎస్ డీఏ రాముడు పాల్గొన్నారు.

పెద్ద వంక పక్కన ఏర్పాటు చేసిన ఇసుక డంప్





సిండికేటుగా ఇసుక దోపిడీ

- ఇసుక డంపులన్నీ టీడీపీ నాయకులవే!
- నీటి పరివాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- సిండికేట్‌గా మారి విక్రయాలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు
- ఇసుక ధర పెరగడంతో సామాన్య ప్రజల గగ్గోలు

డోన్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి తెచ్చినా టీడీపీ నాయకులు దందా కొనసాగిస్తున్నారు. రైతులు, ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసుకోవచ్చు అన్న నిబంధనను తుంగలో తొక్కారు. నీటి పరివాహక ప్రాంతాల్లో ఇసుక కోసం యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇసుక డంపులను ఏర్పాటు చేసి సిండికేట్‌గా మారి ఎక్కువ ధరతో విక్రయాలు జరుపుతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల గృహనిర్మాణ అవసరాల కోసం ఉచితంగా ఇసుకను అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఉత్తుత్తివేనని తేలిపోయింది. స్టీల్, సిమెంట్ ధరలు ఆకాశాన్ని అంటడం, ఇసుక ధరలు కూడా రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గృహనిర్మాణ రంగం డీలాపడిపోయింది.



ఉడుములపాడు చెరువు సమీపంలో అక్రమ ఇసుక రవాణాకు ఏర్పాటు చేసుకున్న రహదారి



చెరువు పక్క నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న దృశ్యం

సిండికేట్ ఇలా..

డోన్‌లో ఇసుక డిపో ఏర్పాటుకు టెండర్లు నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి దానిని కైవసం చేసుకున్నారు. ప్లాస్టింగ్‌కు అవసరమయ్యే సన్నసైజు ఇసుకను అధికార పార్టీకి చెందిన నేత ఒక్కరే విక్రయించాలని ఒప్పందం చేసుకున్నారు. డోన్ నుంచి వివిధ రకాల ఖనిజాలను ఎగుమతి చేసే వాహనాలు తిరిగి సన్న ఇసుక లోడ్‌తో వస్తున్నాయి. పామిడి, నెల్లూరు, తాడిపత్రి ప్రాంతాల నుంచి సన్న ఇసుక వస్తోంది. డంపుల్లో ఉన్న ఇసుకను అధిక ధరతో విక్రయిస్తున్నారు. నాలుగు టన్నుల ట్రాక్టర్ ఇసుకను బేతంచెర్లలో రూ.4,800, ప్యాపిలిలో రూ.4వేలు, డోన్‌లో రూ.4,500కు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసు'కాసు'రులు

డోన్ నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్లలో 10 వేల పక్కాగృహాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉచిత ఇసుక అందకపోవడంతో ఇందులో 30 శాతం గృహాల నిర్మాణాలు నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలకు రూ.50వేలు అదనపు ఆర్థిక సహాయం ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చినా అమలు కాలేదు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో వంకలు, వాగులు, చెరువుల నీటి పరివాహక ప్రాంతాలన్నీ టీడీపీ నాయకుల కబ్జాల్లోకి వెళ్లిపోయాయి. నీటి పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తోడుతున్నారు. అక్రమంగా ఇసుక డంపులను ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు టన్నుల ట్రాక్టర్ గండు ఇసుకను బేతంచెర్లలో రూ.3,800, ప్యాపిలిలో రూ.3,600, డోన్‌లో రూ.4వేల ప్రకారం విక్రయిస్తున్నారు.

ఇష్టారాజ్యం



నీటి పరివాహక ప్రాంతాలైన వంకలు, వాగులు, చెరువుల వద్ద అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ త్రవ్వకాలకు పాల్పడుతున్నారు. రోజూ ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా రవాణా చేసి విక్రయిస్తూ వేలాది రూపాయలను అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఉచితంగా ఇసుక అందజేస్తానన్న కూటమి ప్రభుత్వం అధికార పార్టీ నాయకుల దోపిడీకి వంత పాడటం దురదృష్టకరం. – మెట్టు వెంకటేశ్వర రెడ్డి, మెట్టుపల్లె గ్రామం, ప్యాపిలి మండలం.

ప్రజలను దోపిడీ చేస్తున్నారు



మద్యం విక్రయందారులందరూ సిండికేట్‌గా ఏర్పడి ఎమ్మార్పీ కంటే 20 నుంచి రూ.50 అధికంగా విక్రయిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇసుక విక్రయాల్లో కూడా అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా ఏర్పాటై ఇసుక డంపులను అక్రమంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇది పేద ప్రజలను దోపిడీ చేయడమే.

– ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీ, తాడూరు గ్రామం, డోన్ మండలం.

పూల మాటున 'పచ్చ' డ్రామా!

- పూల వ్యాపారంలో పోటీ లేకుండా టీడీపీ నేత ఎత్తుగడ
- సహచరుడి జీపులను పోలీసులకు పట్టించిన తెలుగు తమ్ముడు
- పూలమండి ఎత్తేస్తే కేసు లేకుండా చేస్తానంటూ హామీ
- వాహనాలు వదిలేసేందుకు పోలీసులు రూ.3 లక్షలు డిమాండ్?

ఆళ్లగడ్డ: అధికార పార్టీ అనే ధీమాతో తెలుగు తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. అధికారులు, పోలీసులు తమ చేతుల్లో ఉన్నారంటూ పచ్చ డ్రామాలకు తెరలేపుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలు, కట్టడాలను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్న చాగలమర్రికి చెందిన టీడీపీ నేత తాజాగా తన వ్యాపారానికి అడ్డొస్తున్నాడని ఓ వ్యాపారిని స్థానిక పోలీసుల సహాయంతో బెదిరించి భయభ్రాంతులకు గురిచేశాడు. టీడీపీ నాయకుడి తీరు నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో చర్చనీయాంశమవుతోంది. చాగలమర్రిలో కొన్నేళ్లుగా పూల వ్యాపారం (మండి) చేస్తున్న టీడీపీ నేత తన పలుకుబడి, రౌడీయిజంతో పోటీగా ఎవరినీ వ్యాపారం చేసుకోకుండా అడ్డుకుంటూ రూ. కోట్లు గడిస్తున్నాడు. ఎవరూ పోటీ లేక పోవడంతో ఇతను చెప్పిందే ధర. ఇతను ఎంత చెబితే అంతకే రైతులు విక్రయించాల్సిన దుస్థితి. అయితే ఈ మధ్య కాలంలో పొరుగునే ఉన్న వైఎస్సార్ జిల్లా ఇడమడక గ్రామానికి చెందిన హుస్సేన్‌బాషా అనే వ్యాపారి చాగలమర్రిలో పూల వ్యాపారం (మండి) ప్రారంభించాడు. దీంతో అతనికి పోటీగా రైతులకు ధర ఎక్కువగా ఇవ్వాల్సి వస్తోందని భావించిన టీడీపీ నేత తనకు పోటీగా పూల వ్యాపారం (మండి) నిర్వహిస్తున్న వారిని ఖాళీ చేయించేందుకు పోలీసులతో కలసి నాటకం మొదలు పెట్టాడు.

వాహనాలు పట్టించి .. విడిపించినట్లు కలరింగ్ ఇచ్చి..

శుక్రవారం రాత్రి దాదాపు రూ. 8 లక్షల విలువైన పూల లోడ్‌తో హుస్సేన్‌బాషాకు చెందిన రెండు వాహనాలు హైదరాబాద్‌కు బయలుదేరాయి. అయితే టీడీపీ నేత ఆదేశాలతో పోలీసులు హైవేపై కాపు కాసి రెండు జీపులను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌కు చేరాల్సిన పూలు స్టేషన్‌కు తరలించారు. ఆలస్యమైతే పూలు పాడైపోతాయంటూ సహచర పూల వ్యాపారి అయిన టీడీపీ నేత రంగంలోకి దిగినట్లు నటన మొదలు పెట్టాడు. ప్రస్తుతం పూలు అయినా వదిలి పెడితే వేరే వాహనంలో హైదరాబాద్ తరలిస్తామని పోలీసులతో మాట్లాడినట్లు షో చేశాడు. ఎస్ఐకి రూ. 50 వేలు ఇస్తే పూలు తరలించుకోవచ్చని టీడీపీ నేత చెప్పడంతో అంత ఇవ్వలేమని రూ. 40 వేలు ఒప్పుకుని వ్యాపారి హుస్సేన్‌బాషా టీడీపీ నేతకు ఫోన్‌పే చేశాడు. పూలను ఇతర వాహనంలో హైదరాబాద్‌కు తరలించాడు. అయితే అప్పటికే ఆలస్యం కావడంతో వ్యాపారి తీవ్రంగా నష్టపోయాడు. కిలో రూ.250 నుంచి రూ. 400 వరకు విక్రయించాల్సిన పూలు కేవలం రూ.100కే అమ్ముడుపోయాయి. దీంతో సుమారు రూ. 6 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు.



రెండు రోజులుగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలు

రూ. 3 లక్షలు ఇస్తావా.. మండి ఖాళీ చేస్తావా?



చాగలమర్రి పోలీస్ స్టేషన్

రికార్డులు సరిగా లేకుంటే జరిమానా వేసి తమ జీపులు వదిలి పెట్టాలని వ్యాపారి శనివారం పోలీసులను ఆశ్రయించగా పోలీసుల నుంచి ఎటువంటి స్పందన కనిపించ లేదు. అంతలో స్థానిక పూల మండి యజమాని అయిన టీడీపీ నాయకుడు బాధిత యజమానిని పిలిపించి రెండు వాహనాలు స్టేషన్ నుంచి విడిపించాలంటే చాగలమర్రిలో పూల మండిని ఎత్తేయాలని ఆదేశించాడు. అందుకు వ్యాపారి ఒప్పుకున్నాడు. తర్వాత పోలీసు స్టేషన్ దగ్గరకు వెళ్లండి ఎస్ఐతో మాట్లాడతానని చెప్పి పంపించాడు. అయితే పోలీస్ స్టేషన్ దగ్గరకు వెళ్లిన బాధితుడు పోలీసుల తీరు చూసి అవాక్కయ్యాడు. 'మీరు.. మీరు మాట్లాడుకుంటే సరిపోతుందా మాకేంటి' అంటూ గట్టిగా మందలించడంతో నిర్ఘాంత పోయాడు. మళ్లీ టీడీపీ నేతను సంప్రదించగా 'పోలీసులు రూ.3 లక్షలు అడుగుతున్నారు.. ఇచ్చి వాహనాలు తీసుకుపో' అని అనడంతో వ్యాపారి ఏమి చేయాలో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కుట్ర

- కర్నూలు జిల్లాలో 1590, నంద్యాల జిల్లాలో 736 మంది దివ్యాంగులు పింఛన్లకు దూరం

కర్నూలు(అగ్రికల్చర్): అనర్హత పేరుతో దివ్యాంగుల పింఛన్లను భారీగా తొలగించేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలో దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారు 55,861 మంది ఉన్నారు. గత ఏడాది జూన్ నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారిలో అనర్హులు భారీగా ఉన్నారనే ప్రచారాన్ని టీడీపీ నేతలు తెరపైకి తెచ్చారు. అనర్హత పేరుతో భారీగా తొలగించి ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో వికలత్వ నిర్ధారణ కోసం రీవెరిఫికేషన్ ప్రక్రియ మొదలైంది. దాదాపు ఏడు నెలలుగా ఈ కార్యక్రమం జరుగుతుండటం గమనార్హం. కర్నూలు జిల్లాలో దివ్యాంగుల పింఛన్‌లు 30,605 ఉండగా.. ఇప్పటి వరకు 25,752 మంది దివ్యాంగులను సదరం క్యాంపుల్లో రీ వెరిఫికేషన్ చేశారు. 1,590 మంది దివ్యాంగులు రీ వెరిఫికేషన్‌కు వివిధ కారణాలతో హాజరు కాలేకపోయారు. నంద్యాల జిల్లాలో 25,256 దివ్యాంగుల పింఛన్‌లు ఉండగా... ఇప్పటి వరకు 22,280 మంది దివ్యాంగులు రీ వెరిఫికేషన్ చేపట్టారు. 736 మంది రీవెరిఫికేషన్‌కు హాజరు కాలేదు. ఉమ్మడి జిల్లాలో రీవెరిఫికేషన్‌కు హాజరు కాని 2,326 దివ్యాంగుల పింఛన్‌లను కూటమి ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. వీరందరూ ఆగస్టు నెల పింఛన్‌లను పొందలేకపోయారు. కాగా..వీరందరూ సదరం క్యాంపునకు హాజరయ్యేందుకు షెడ్యూలు ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మొత్తం దివ్యాంగుల పింఛన్‌లలో 25 నుంచి 30 శాతం వరకు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 98 మి.మీ, అత్యల్పంగా గడివేముల మండలం 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉయ్యాలవాడ, చాగలమర్రి 38.8, శిరివెళ్ల 32.8, రుద్రవరం 32.6, దొర్నిపాడు 29.4, ఆళ్లగడ్డ 28.4, సంజామల 26.2, కోవెలకుంట్ల 15.4మి.మీ, అవుకు 12.2, నంద్యాల రూరల్ 11.4, బండిఆత్మకూరు 9.2, వెలుగోడు 8.2, గోస్పాడు 7, నంద్యాల అర్బన్ 3.8, బేతంచెర్ల 2.2, మిడుతూరు 2.0, డోన్ 0.6 మి.మీ వర్షం కురిసింది. పలు చోట్ల వాగులు వంకలు పొంగి పొర్లాయి.

సింహ వాహనంపై ప్రహ్లాదరాయలు

- ఘనంగా పూర్వారాధన ఉత్సవాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మంత్రాలయం: మేళతాళాల సుస్వరాలు.. పండితుల వేద ఘోషలు.. కేరళ డోలు ధ్వానాలు.. భక్తజనుల కోలాహలం మధ్య ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు సింహవాహనంపై దేదీప్యమానంగా ఊరేగాడు. శ్రీరాఘవేంద్రుడి 354వ ఆరాధన సప్త రాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో పూర్వారాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులకు ఊంజల మండపంలో ఊంజల, దివిటి సేవలు చేశారు. అనంతరం ప్రహ్లాదరాయలును సింహవాహనంపై శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఉదయం రాఘవేంద్రుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, పుష్పార్చన, విశేష పంచామృతాభిషేకంతో పాటు పుష్పాలంకరణతో విశేషంగా అలంకరించారు. పూజా మదిరంలో రాయరు, మూల, జయ, దిగ్విజయ, రాములకు సంస్థాన పూజ నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ, ఫల, పూల, మంత్రాక్షింతలతో ఆశీర్వచనలు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పూర్వారాధన సందర్భంగా యోగీంద్ర మండపంలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన బెట్ట వెంకటేష్ బృందం నాద తరంగిని, జుగల్‌బందీ చేపట్టారు. రాయచూరుకు చెందిన మంగళకలార్పన సంది నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.



సింహ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అనుగ్రహ ప్రశస్తి అవార్డులు

రాఘవేంద్రస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులకు రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేశారు. ఆదివారం యోగీంద్ర మంటపంలో కాశి యూనివర్సిటీ రిటైర్డు వైస్ చాన్స్‌లర్, పండిట్ రాజారామ్ శుక్లా, కోయంబత్తూరుకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ పీఆర్ విఠల్‌కు పీఠాధిపతి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. భక్తుల కోరిక మేరకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు పుష్పవృష్టికి గావించారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి శ్రీధర్‌రావు, ఏఏవో మాధవశెట్టి అవార్డు గ్రహీతల బయోడేటా భక్తులకు పరిచయం చేశారు.

ఒక్క మాత్రతో 'నులి'పేద్దాం!

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి చర్యలు
- జిల్లాలో 4,38,475 మంది పిల్లలు
- 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ మాత్రలు
- రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

గోస్పాడు: చిన్నారులను పీడించే అనారోగ్య సమస్యల్లో నులిపురుగులు ప్రధానమైనవి. ఈ పురుగులు పిల్లల కడుపులో చేరి మెలిపెడుతూ పిల్లల్లో పేలతనం, నీరసం, ఆహారం సరిగా తీసుకోకపోవడం తరచూ కనిపిస్తుంటుంది. అలాగే పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయి. రక్తహీనత, పోషకలోపం, పలు అనారోగ్య సమస్యలకు కారణమవుతుంటాయి. నిర్లక్ష్యంగా ఉంటే జీవితాలనే నులిమేస్తాయి. 19 సంవత్సరాలలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువ ఉంటుంది. ఒకే ఒక్క మాత్ర ఆల్బెండ్ జోల్‌తో ఈ సమస్యను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈనెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీలు, పాఠశాలలు, జూనియర్, కళాశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్యశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,141 పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా గుర్తించారు. వీటి పరిధిలో 1,22,094 మంది ఒక సంవత్సరం నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు, 3,16,381 మంది 6 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు ఉన్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారులు గుర్తించారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఏదైనా పరిస్థితుల దృష్ట్యా 12వ తేదీన మాత్రలు తీసుకొని వారు ఉంటే వారి కోసం మాప్ అప్ డే రోజున ఈనెల 20వ తేదీ మరోమారు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు అందజేయనున్నారు.

మాత్రల డోస్ ఇలా..

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర (200 మిల్లీ గ్రాములు) నీటిలో కలిపి తాపాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 మిల్లీగ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. మింగకుండా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలి.





వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ, అధికారులు

అపరిశుభ్రతే కారణం...

పిల్లల్లో నులిపురుగులు సంక్రమించడానికి ప్రధాన కారణం అపరిశుభ్రత. దుమ్ము, ధూళి, మట్టిలో ఆడుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. పిల్లల చేతిగోర్లను శుభ్రంగా ఉంచేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. భోజనం చేసేటప్పుడు, మూత్ర, మల విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవడం పిల్లలకు నేర్పించాలి. పండ్లను నీటితో కడిగి తినాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూతలు మూసి ఉంచాలి.

వ్యాపించే విధానం...

శరీరంలో నులిపురుగులు ఉన్న వారు చేసిన మల విసర్జన ద్వారా కలుషితం అయి తద్వారా వాటి గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అంతేకాక తాగు నీరు, గాలి ద్వారా ఆహార పదార్థాలపై చేరుతాయి. మురికి చేతులు ద్వారా ఈ లార్వా చర్మం లోపలికి చొచ్చుకుపోవడం ద్వారా మిగతా పిల్లలకు నులి పురుగులు సంక్రమిస్తాయి.

అనేక రకాలుగా అనర్థాలు..

నులిపురుగులు అపరిశుభ్రత వల్లే శరీరంలోకి ప్రవేశిస్తాయి. పిల్లల రక్తహీనతకు దారితీస్తాయి. మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయి. కడుపునొప్పి, వికారము కలగజేస్తాయి. ఆహారం సహించదు ,ఆకలి ఉండదు. నీరసంగా ఉంటుంది.పిల్లల కడుపులో కొంకి, నులి, బద్దె, గుండ్రని పురు గులు రక్తాన్ని పీల్చేస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆ పురుగుల పునరుత్పత్తి, ఎదుగుదల మొత్తం మన కడుపులోనే జరగడంతో మనం తీసుకునే ఆహారాన్ని ఆ పురుగులు శోషించుకుంటాయి.

అవగాహన కల్పించాం



ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. మాత్రలను చప్పరించడం లేదా నమిలి మింగటం చేయాలి. మాత్రలు తీసుకున్న తర్వాత ఏవిధమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలి. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నాం.

– డాక్టర్ కాంతారావునాయక్, జిల్లా ప్రోగ్రాం అధికారి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం

మాత్రల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు



ఈ నెల 12న జిల్లా అంతటా ఆల్బెండాజోల్ మాత్రలు పిల్లలకు అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 4,38,475 మంది పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు అందజేయనున్నాం. నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవడం ఒక్కటే మార్గం. కాలకృత్యాల తీర్చుకున్న అనంతరం తప్పనిసరిగా చేతులను శుభ్రపరుచుకోవాలి.

– డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, నంద్యాల.

క్లుప్తంగా

భార్య కాపురానికి రాలేదని..


ఆత్మహత్యకు పాల్పడ్డ అశోక్

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన ఓ యువకుడు ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన మిద్దె అశోక్(35) స్థానిక ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ పద్ధతిన బస్సులు స్వీపింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇరవై రోజుల క్రితం భార్య, భర్తల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో ఇటీవలే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

నకిలీ సమాచారాన్ని నమ్మొద్దు

నంద్యాల(వ్యవసాయం): ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థలో డ్రైవర్ పోస్టుల భర్తీకి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదని ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారిణి రజియాసుల్తానా ఆదివారం తెలిపారు. డ్రైవర్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్లు పర్సనల్ అధికారి తెలిపినట్లుగా ఒక దిన పత్రికలో వార్త ప్రచురితమయిందన్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని, పర్సనల్ అధికారి ఎలాంటి ప్రకటనను జారీ చేయలేదని, కావున ప్రజలు, నిరుద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఉపాధ్యాయుడు మృతి

కర్నూలు సిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎమ్మిగనూరు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వి.శివనాగరాజు(45)కు ఉల్చాల రోడ్డు జంక్షన్‌లో ఈ నెల 8న రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. తలకు గాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేశారు. అయితే చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. వి.శివనాగరాజుకు భార్య ప్రియాంక, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెక్రిష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరాముడు, గట్టు తిమ్మప్ప, గోట్ల చంద్రశేఖర్‌లు హాస్పిటల్‌కి వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.




బుజ్జి పిట్ట.. చిట్టి గూళ్లు!

పిట్ట కొంచెం కూత ఘనమే కాదు.. గూడు కట్టడంలో ఎవరైనా తన తర్వాతనే అని చెప్పవచ్చు. తన పొదరిల్లు నిర్మాణంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటుందో తెలుసుకుంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఇతర జీవాల నుంచి రక్షణగా చిటారు కొమ్మన గూడు కట్టుకుంటోంది. తేలిక పాటి గడ్డి పోచలతో మెత్తని పాన్పు వల్లె అల్లుకుంటుంది. కళాత్మకమైన గిజిగాడు గూళ్లను చూస్తే ఎవరైనా మెచ్చుకోవాల్సిందే. గార్గేయపురం సమీపంలోని ఓ వ్యవసాయ బావి గట్టుపై ఉన్న చెట్టు కొమ్మలకు బుజ్జి పిట్టలు చిట్టి గూళ్లను ఏర్పాటు చేసుకుని నివాసముంటున్నాయి.

– కర్నూలు(రూరల్)



కొండల రాయుడికి నేడు తేళ్ల నైవేద్యం

ఎక్కడైనా దేవుళ్లకు పాలు, పండ్లు, ఫలహారాలను భక్తులు నైవేద్యంగా సమర్పిస్తారు. అయితే కోడుమూరు కొండపై వెలసిన శ్రీకొండలరాయుడికి మాత్రం భక్తులు తేళ్లను చేతులతో పట్టుకొని స్వామివారిపై వదిలి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి యేడాది శ్రావణమాసంలో వచ్చే మూడో సోమవారం ఈ వింత ఆచారాన్ని ప్రజలు దశాబ్దాలుగా కొనసాగిస్తున్నారు. విషపురుగులైన తేళ్లను చూస్తే ఎక్కడైనా ప్రజలు ఆమడదూరం పరుగెడతారు. ఇక్కడ కొండమీద మాత్రం భక్తులు చిన్న రాళ్లను ఎత్తుతూ వాటికింద ఉండే తేళ్లను ఎలాంటి జంకుబొంకులేకుండా పట్టుకొని స్వామికి నైవేద్యంగా సమర్పించి కోరికలను కోరుకుంటారు. చిన్నా పెద్దా తేడా లేకుండా నిర్భయంగా తేళ్లను చేతులతో పట్టుకొని స్వామివా రికి సమర్పించడం విశేషం.

తేలు కుట్టినా ఏమీ కాదన్న నమ్మకం

స్వామి వారికి సమర్పించేందుకు తేలును పట్టుకునే సమయంలో కుట్టినా ఏమి కాదని భక్తులు చెబుతారు. తేలు కుట్టినపుడు స్వామి వారి ఆలయం చుట్టు మూడు సార్లు ప్రదక్షిణలు చేస్తే తగ్గిపోతుందనేది భక్తుల నమ్మకం. కొండపై వెలసిన కొండలరాయుడును దర్శించుకోవాలంటే ప్రజలు కిలోమీటర్‌కుపైగా ఉన్న కొండను కాలినడకన ఎక్కాలి.

– కోడుమూరు రూరల్

పొలంలోకి దూసుకెళ్లిన కారు

● స్కూటర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

టైరు ఊడిపోయిన కారు ఇద్దరు రైతులను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటన హత్తిబెళగల్ బస్ స్టాప్ సమీపంలో ఆదివారం ఉదయం చేసుకుంది. వివరాలు.. హత్తిబెళగల్ గ్రామానికి చెందిన రైతులు ఓంకార్, రామచంద్ర ఉదయం పొలం చూడడానికి స్కూటర్‌పై గుంతకల్లు రహదారిలో వెళ్తున్నారు. గుంతకల్లు నుంచి ఆలూరు వస్తున్న సఫారి కారు ముందు భాగంలోని టైరు ఊడిపోయి స్కూటర్‌ను ఢీకొట్టి పొలాల్లో దూసుకెళ్లింది. ప్రమాదంలో ఓంకార్ ఎడమకాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. రామచంద్రకు గాయాలయ్యాయి. ప్రయాణికులు గమనించి క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు చేసి డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

– ఆలూరు రూరల్



డెంగీ బూచీ.. రోగులను దోచి!

- ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా వసూళ్లు
- ర్యాపిడ్ టెస్ట్ రిపోర్టుతోనే చికిత్స
- ఎలీసా టెస్ట్ చేయించని ఆసుపత్రులు
- పలు ల్యాబ్‌ల్లో తప్పుడు నివేదికలు..!
- ప్రతి జ్వరమూ.. డెంగీ కాదంటున్న వైద్యులు



కర్నూలు(హాస్పిటల్): దోపిడీ జబ్బు ఉన్న కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు డెంగీ బూచీతో జ్వరపీడితుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. జ్వరంతో వెళ్తే చాలు ర్యాపిడ్ టెస్ట్ చేయడం, ప్లేటెలెట్స్ తగ్గాయని భయపెట్టడం, తర్వాత చికిత్స పేరుతో రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు బిల్లులు బాదడం పరిపాటిగా మారింది. డెంగీ జ్వరం నిర్ధారణ ర్యాపిడ్ టెస్ట్ ద్వారా గాకుండా ఎలీసా టెస్ట్ ద్వారా చేయాలని అధికారులు చెబుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటితో పాటు మరో 12 ఆరోగ్య కేంద్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. వీటితో పాటు 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. వీటితో పాటు కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలో 170కి పైగా రిజిస్టర్డ్ ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. జిల్లాలో గత జనవరి నుంచి ఇప్పటి వరకు 190 మంది వరకు డెంగీ వ్యాధిగ్రస్తుల సంఖ్య నమోదైంది. ఈ వ్యాధి లక్షణాలతో ఉన్న వారు దీనికి మూడింతలు ఉన్నారు. చాలా మంది పేదలు, మధ్యతరగతి ప్రజలు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. కాస్త ఆర్థిక స్తోమత ఉన్న వారు మాత్రం ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో వైద్యుల సంఖ్య పెరగడం, అందరికీ డిమాండ్ లేకపోవడం, రోగుల సంఖ్య తక్కువగా ఉంటోంది. దీంతో కొందరు వైద్యులు వచ్చిన వారి నుంచే ఎక్కువగా వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. కొందరు ఆర్‌ఎంపీలకు 50 శాతానికి పైగా కమీషన్లు ముట్టజెబుతూ వారి ఆసుపత్రులకు రోగులు తెచ్చేలా చేసుకుంటున్నారు. ఇలా వచ్చిన వారిని ముందుగా రూ.5వేలకు తగ్గకుండా వివిధ రకాల వైద్యపరీక్షలు చేయించి చికిత్స చేస్తున్నారు. సాధారణ జ్వరంతో వెళ్లినా రూ.6వేలకు తక్కువగాకుండా వసూలు చేస్తున్నారు. ఇలాంటి ఆసుపత్రులు ఎక్కువగా కర్నూలులోని కొత్తబస్టాండ్, ఎన్‌ఆర్ పేట, గాయత్రి ఎస్టేట్ వంటి ప్రాంతాల్లో ఉన్నాయి. వైద్యులకు అధిక మొత్తంలో డబ్బులు ఇచ్చుకోలేని కొందరు రోగులు ప్రైవేటు వైద్యుల వద్ద పరిస్థితిని అర్థం చేసుకుని తాము మళ్లీ వస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే చాలా మంది రోగులు జ్వరం వచ్చిందంటే ముందుగా మెడికల్‌షాపులకు వెళ్లి లక్షణాలు చెప్పి మందులు కొని వాడి తగ్గించుకుంటున్నారు.

డెంగీ ఇలా వస్తుంది

డెంగీ జ్వరం ఏడిస్ ఈజిప్టై అనే దోమకాటు వల్ల వస్తుంది. ఈ దోమ శరీరంపై నల్లటి, తెల్లటి చారలు ఉంటాయి. శరీరంపై చారలు ఉండటం వల్ల దీనిని పులిదోమ అని కూడా పిలుస్తారు. ఈ దోమ శుభ్రమైన, నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. సూర్యోదయమైన రెండు గంటల వరకు, సూర్యాస్తమయానికి రెండు గంటల ముందు మాత్రమే ఇది కుడుతుంది. ఇది కేవలం రెండు వారాలు మాత్రమే జీవిస్తుంది. ఈ దోమ తన జీవితకాలంలో మూడుసార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ప్రతిసారీ వంద గుడ్లను పెడుతుంది. ఈ దోమలు ఇంట్లో బట్టలు, పరుపులు, కర్టన్స్ వెనుక కూడా దాక్కుంటాయి.

ఈ దశలోనే ఆసుపత్రిలో చేర్చాలి

- తీవ్రమైన కడుపునొప్పి, రక్తవాంతులు అవుతుంటే, శరీరంపై ఎర్రటి దద్దుర్లు రావడం, ముక్కు, చిగుళ్లల్లో రక్తం స్రవించడం, మల మూత్రాల్లో రక్తం పడటం, మత్తుగా ఉండటం, ఊపిరితీసుకోవడం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో తప్పనిసరిగా ఆసుపత్రిలో చేర్చాలి.
- డెంగీ షాక్ సిండ్రోమ్, డెంగీ హెమరేజిక్ సిండ్రోమ్ దశలో ఆలస్యం చేయకుండా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాలి.
- సాధారణ మనిషిలో ప్లేట్‌లెట్లు 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ఉంటాయి. డెంగీ సీజన్‌లో ఈ రక్తకణాల సంఖ్య 10వేలలోపు ఉంటే మాత్రమే జాగ్రత్త పడి ఆసుపత్రిలో చేరాలి.
- జ్వరం తగ్గినా కూడా వారం తర్వాత అప్రమత్తంగా ఉండాలి. ఈ దశలో శరీరంలో వాపులు వస్తే మాత్రం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

ర్యాపిడ్ టెస్ట్‌తో దోపిడీ

డెంగీ పరీక్ష నిర్ధారణ కోసం మొదట ర్యాపిడ్ కిట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. అందులో డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే ఆ రోగి రక్తనమూనాలను కర్నూలు మెడికల్ కాలేజీలోని మైక్రోబయాలజీ ల్యాబ్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలి. ఈ ల్యాబ్‌లకు ప్రతిరోజూ 30 నుంచి 40 వరకు రక్తనమూనాలు వస్తున్నాయి. ఇక్కడి నివేదికల ఆధారంగా డెంగీ నిర్ధారణ చేస్తారు. ఇక్కడి వైద్యులు ఇచ్చే టెస్ట్ ఆధారంగానే వ్యాధి నిర్ధారణ చేస్తారు. కానీ అధిక శాతం ప్రైవేటు ఆసుపత్రులు కేవలం ర్యాపిడ్ కిట్‌లో వచ్చిన నివేదికల ఆధారంగా డెంగీగా చెప్పి చికిత్స చేస్తున్నారు. రక్తంలో ప్లేట్‌లెట్లు(రక్తకణాలు) తగ్గాయని చెప్పి బ్లడ్‌బ్యాంకులకు పంపి వాటిని తెప్పించి ఎక్కిస్తున్నారు.

ఎలీసా టెస్ట్ ద్వారానే డెంగీ నిర్ధారణ చేయాలి



కర్నూలు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రభుత్వ డెంగీ నిర్ధారణకు ఎలీసా టెస్ట్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరపీడితులకు ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ వస్తే వెంటనే ఆ వ్యక్తి రక్తాన్ని ఎలీసా టెస్ట్ కోసం పంపించాలి. ఎలీసా టెస్ట్‌లో డెంగీ నిర్ధారణ అయితేనే చికిత్స చేయాలి. డెంగీగా చెప్పి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

తెగిపోయిన రోడ్డు

● స్తంభించిన రాకపోకలు


బుగ్గ సమీపంలో కొట్టుకుపోయిన సర్వీస్ రోడ్డు

కొలిమిగుండ్ల: భారీ వర్షానికి అనంతపురం జిల్లా బుగ్గ సమీపంలోని రోడ్డు తెగిపోయింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా సరిహద్దుకు 50 మీటర్ల సమీపంలో అనంతపురం జిల్లా బుగ్గకు చేరువలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో ఉండటంతో అక్కడ వాహనాల రాక పోకల కోసం సర్వీస్ రోడ్డు నిర్మించారు. భారీ వర్షం కురవడంతో వాగు నీటికి రోడ్డు కొట్టుకుపోయింది. వందల సంఖ్యలో వాహనాలు ఇరువైపులా బారులుతీరాయి. చాలా మంది ట్రాఫిక్‌లో నిలిచిపోవడంతో పెళ్లిళ్లకు చేరుకోలేక పోయారు. ఆదివారం కావడంతో చాలా మంది తల్లితండ్రులు తమ పిల్లల కోసం పాఠశాలలు, కాలేజీల వద్దకు వెళ్లెందుకు తెల్లవారు జాము నుంచి బస్సులు కోసం నిరీక్షించినా ఫలితం లేకుండా పోయింది. మూడు జిల్లాలకు సరిహద్దులో ఉన్న కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా మారిపోయింది. బనగానపల్లె, జమ్మలమడుగు డిపో బస్సులు జిల్లా సరిహద్దులో ఉన్న రాయల్టీ చెక్‌పోస్టు వరకు మాత్రమే వెళ్లి అక్కడి నుంచి వెనుదిరిగి వచ్చాయి. బస్సుల కోసం గంటల సమయం ఎదురుచూడాల్సి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా మంది తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. రవాణా స్తంభించడంతో కొలిమిగుండ్లతో పాటు అవుకు, బనగానపల్లె, వైఎస్సార్‌జిల్లా, తాడిపత్రి ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపింది.

మద్దిలేటిస్వామి సేవలో జడ్జీలు

బేతంచెర్ల: శ్రీలక్ష్మీమద్దిలేటి నరసింహస్వామిని ఆదివారం కర్నూలు జువైనల్ కోర్టు అండ్ ఎక్సైజ్ కోర్టు, ఇంచార్జ్ డోన్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు జడ్జి అనిల్‌కుమార్, కర్నూలు మొబైల్ కోర్టు జడ్జి అనూష (దంపతులు) కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జడ్జీలకు స్వాగతం పలికి పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాల, చిత్ర పటంతో సత్కరించగా, వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.


జడ్జీలకు స్వామి చిత్రపటాలను అందిస్తున్న దృశ్యం

దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని రూరల్/ ఎమ్మిగనూరురూరల్: ఆదోని మండం ఆరేకల్‌లోని ఆంధ్రప్రదేశ్ నూతన మైనార్టీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5, 6, 7 తరగతుల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బనవాసి ఏపీఆర్ (గర్ల్స్) ప్రిన్సిపాల్ పి.సామ్రాజ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8712625067 ఫోన్ చేయాలని కోరారు.

'కూటమి' చేస్తున్న అప్పులను గమనించాలి


ప్రవాసాంధ్ర ప్రతినిధులతో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన కుమారుడు కాటసాని శివ నరసింహారెడ్డి

● అమెరికా డల్లాస్‌లో కాటసాని ఆత్మీయ సమావేశం

పాణ్యం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులను, దోపిడీని ప్రపంచ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు గమనించాలని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయనకు అక్కడున్న ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. అనంతరం డల్లాస్‌లో ఏర్పాటు చేసిన ప్రవాసాంధ్ర ప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. జగనన్న పాలన అంటే ప్రజలకు నమ్మకమన్నారు. జగనన్న పాలనలో 15,004 గ్రామ, వార్డు సచివాయాలు ఏర్పాటయ్యాయని, 2.6 లక్షల మంది వలంటీర్లీ సేవలు అందించారని, స్పందన కార్యక్రమంతో లక్షల సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. కొత్తగా 17 మెడికల్ కళాశాలు, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ, ఆరోగ్యశ్రీలోకి 3 వేలలకు పైగా చికిత్స చేరి సామాన్యులకు ఆరోగ్య భరోసా కలిగిందన్నారు. పదివేలకు పైగా వైఎస్సార్ ఆరోగ్య క్లినిక్‌లు తీసుకొచ్చారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా 50వేల పైగా పాఠశాలలను ఆధునికీకరణ చేశారన్నారు. మొత్తం 6.16 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 28.89లక్షల ప్రయివేట్ ఉద్యోగాలు కలిపించారన్నారు. సీఎస్‌డీపీ వృద్ధిరేటు 11.43శాతంగా దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జగనన్న పాలనలో కాగ్ నివేదిక కేంద్ర గణాంకాలు ఉన్నాయన్నారు. టీడీపీ, జనసేన, కూటమి తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేశాయని, సోషల్ మీడియా పోస్టులతో ప్రజలకు నిజం చెప్పాలన్నారు. జగనన్న నాయకత్వం ఎలా ఉంటుందో ప్రపంచానికి తెలియాలన్నారు. నిజం మాట్లాడే గొంతులుగా ఎన్‌ఆర్‌ఐలు ముందుకు రావాలన్నారు.

'ఆకర్ష్' సేవలు అభినందనీయం

● కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా


కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: 'అల్యూమిని అసోసియేషన్ ఆఫ్ కాల్వబుగ్గ రెసిడెన్షియల్ స్కూల్'(ఆకర్ష్) పేరుతో పాఠశాల అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ రంజిత్ బాషా అభిప్రాయపడ్డారు. ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన 1992-93, 1998-99వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి ఆకర్ష్ అధ్యక్షులు రాఘవేంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర గురుకుల పాఠశాల సొసైటీ ఛీఫ్ సెక్రటరీ మస్తానయ్య, కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా ప్రిన్సిపాల్ ప్రసాదరావు పాఠశాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి అసరమైన నిధుల మంజూరుకు సంబంధించిన నివేదికలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆకర్ష్‌లో చేరిన ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ల సమీపంలో రూ.5 కోట్లతో జాతీయ స్థాయిలో స్టేడియాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఆకర్ష్ బోర్డు గౌరవ సభ్యులు కిరణ్‌కుమార్, సొసైటీ అధ్యక్షులు రాఘవేంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ వరప్రసాద్, జిల్లా, రాష్ట్ర, దేశ విదేశాలల నుంచి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు పాలక వర్గాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నాన్ అఫీషియల్ పాలక వర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గాల్లో చైర్మన్‌తో పాటు ఇద్దరు పాలక సభ్యులు ఉన్నారు. ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు సొసైటీల పాలక వర్గాలు ఏర్పాటు అయ్యాయి. కర్నూలు జిల్లాలో 4, నంద్యాల జిల్లాలో 39 సహకార సంఘా లకు పాలక వర్గాలు ఏర్పాటు చూస్తూ ప్రభుత్వం ఆదివారం జీవో ఆర్‌టీ నెంబరు 669, 670 జారీ అయ్యాయి.

ప్రజల హక్కుల పరిరక్షణకు చర్యలు

కర్నూలు(అర్బన్): ప్రజల హక్కులను పరిరక్షించేందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కట్టుబడి ఉంటుందని కౌన్సిల్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఈదురు పద్మాకర్ అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల హక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా కౌన్సిల్ వెంటనే స్పందిస్తుందన్నారు. వారి హక్కులను కాపాడేందుకు జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి అవసరమైన చర్యలను చేపడుతామన్నారు. ఆయా వర్గాలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. జిల్లాలో కొందరు వ్యక్తులు కౌన్సిల్ పేరుతో నకిలీ గుర్తింపు కార్డులు ముద్రించుకొని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా వారు తమ పద్ధతులు మార్చుకోవాలని, లేని పక్షంలో అలాంటి వారిని గుర్తించి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. తమ హక్కులను కాపాడుకోవడంలో భాగంగా తమ పరిధిలో జరిగే అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తే ఆయా సమస్యలు వెలుగులోకి రావడంతో పాటు పరిష్కారం అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు అక్బర్, ప్రధాన కార్యదర్శి బెస్త గోవిందరాజులు, రమణ, సోమన్న తదితరులు పాల్గొన్నారు. ఐస్ ఫ్యాక్టరీ విషయంలో తనకు అన్యాయం జరిగిందని కౌన్సిల్‌కు డోన్‌కు చెందిన లక్ష్మణస్వామి వినతి పత్రాన్ని అందించారు.


నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు